

11న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ఈ నెల 11న శ్రీ గౌతమి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎపి ప్రభుత్వం, కాకినాడ వికాస్, శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 11న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.30 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, 18-45 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులు, పదో తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న విద్యార్థులు అర్హులన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. ఈ ఇంటర్వ్యూలకు 18 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, ఎంపికైన విద్యార్థులకు వెంటనే మంజూరు పత్రాలను అందిస్తారని తెలిపారు.



గోదావరి వాసుల.. తాగునీటి ఘోష..!

- కొత్త ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించేనా?
- ఆక్వా చెరువులతో తాగునీటి వనరులు ధ్వంసం
- కొనుగోలు చేస్తే తప్ప తీరని దాహం
- వాటర్‌గ్రిడ్ అంటూ గత ప్రభుత్వం ఐదేళ్లు కాలక్షేపం
- గంపగుత్తగా ఓట్లేసిన గోదావరి ప్రజల గోడు వినేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పరవళ్లు తొక్కే గోదావరిని ఆనుకుని ఉన్నా దాహం తీర్చుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న జిల్లా ప్రజల ఘోష కొత్త ప్రభుత్వానికైనా వినిపించేనా అనే చర్చ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి కూటమి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 స్థానాలనూ గెలుచుకుంది. దీంతో జిల్లాలోని ప్రధానమైన తాగునీటి సమస్యను కొత్త ప్రభుత్వమైనా పరిష్కరించాలని అంతా కోరుతున్నారు. విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలు సాగించడంతో రెండు జిల్లాల్లోని తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. ఆక్వా చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఆదేనీటిని పంచాయతీ తాగునీటి ట్యాంకుల్లోకి నింపుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 40 లక్షల జనాభా ఉంది. ముఖ్యంగా డెల్టా పరిధిలోని 29 మండలాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డబ్బు పెట్టి కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి నెలకొంది. నెలకు కనీసంగా లెక్కించినా రూ.600కుపైగా తాగునీటి కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలోని తాగునీటి సమస్యనే ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా సాగింది. అయితే సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఏ గ్రామం వెళ్లి పరిశీలించినా పంచాయతీ ట్యాంకుల నుంచి విడుదల చేస్తున్న నీరు తాగడానికి పనికిరాని పరిస్థితి. పసర్లు కమ్మి అధ్వానంగా ఉంటున్నాయి. 2019 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ ద్వారా గోదావరి నుంచి పైపులైన్ వేసి ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తామని వైసిపి ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో హడావుడి చేసింది. వాటర్‌గ్రిడ్‌కు రూ.3,200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. తర్వాత వాటర్‌గ్రిడ్ పథకాన్ని డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించి రూ.1400 కోట్లకు బడ్జెట్‌ను కుదించింది. అయినప్పటికీ ఐదేళ్ల పదవీకాలంలో వాటర్‌గ్రిడ్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో జిల్లాలోని తాగునీటి సమస్య ఇప్పటికీ అలానే ఉండిపోయింది. ఎన్నికల ముందు ప్రతి పార్టీ తాగునీటిపై హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. జిల్లాప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధానమైన తాగునీటి సమస్యను కూడా పాలకులు పట్టించుకోకపోవడం ఇక్కడి ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది. వైసిపి ఓటమిలో ఈ అంశం కూడా ప్రధానమైందని చెప్పొచ్చు.

కలుషిత నీటితో అనారోగ్యం పాలు

జిల్లాలో అత్యధికంగా దిగువ మధ్యతరగతి ప్రజానీకం ఉన్నారు. ఏరోజు పనికి వెళ్తే ఆ రోజే కడుపు నిండే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ప్రతిరోజూ రూ.30 వెచ్చించి తాగునీరు కొనుగోలు చేయలేక కలుషిత నీటినే తాగుతున్నారు. దీంతో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో కిడ్నీ సమస్యలు, కేన్సర్ వంటి రోగాలు ఎక్కువగా రావడానికి కలుషిత తాగునీరే కారణమనే చర్చ నడుస్తోంది. ఇంకా అనేక రోగాలు జిల్లా ప్రజలను చుట్టుముడుతున్న పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వమైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పెండింగ్ పనులకు అనుమతులివ్వండి

కలెక్టర్‌ను కోరిన ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెండింగ్ పనులకు తక్షణమే అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. ఆయన శుక్రవారం భీమవరంలోని కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో అత్యంత ప్రాధాన్యమైన రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులను ప్రారంభించేందుకు ఆదేశాలివ్వాలని కోరారు. పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు రక్షిత నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద తాగునీటి సమస్య

పరిష్కరించాలని కమిషనర్‌కు ఎంఎల్ఎ ఆదేశం

ప్రజాశక్తి - పాలకొల్లు



టిడ్కో ఇళ్ల వద్ద అర్ధరాత్రి తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల

పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద తాగునీటి సమస్య ఏర్పడింది. గురువారం రాత్రి మోటార్లు పని చేయక నీరు ఓవర్‌హెడ్ ట్యాంకుకు వెళ్లకపోవడంతో నివాసులు ఇబ్బందులు పడ్డారు. వారు వెంటనే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి అర్ధరాత్రి వేళ టిడ్కో ఇళ్ల వద్దకు చేద్దకు చేరుకుని సమస్యను పరిశీలించారు. మున్సిపల్ అధికారులను అక్కడికి రప్పించి పాడైన మోటార్ స్థానంలో భీమవరం నుంచి మరో మోటార్ రప్పించారు. ఆ మోటార్ కూడా పని చేయకపోవడంతో ముందు మరమ్మతుకు గురైన మోటారును మరోసారి మరమ్మతు చేయించి తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, మున్సిపల్ ఇంజినీర్ సాంబశివరావును ఆదేశించారు. ఐదు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేయకపోవడంతో వీధిలైట్లు, తాగునీటి సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. త్వరలోనే ఈ రెండు సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మలను టిడ్కోవాసులు సత్కరించారు.



బ్యాంకులో కౌంటర్ వద్ద క్యూ లైన్‌లో ఉన్న ఖాతాదారులు

మొగల్తూరు ఎస్‌బిఐలో ఖాతాదారుల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎస్‌బిఐ ఖాతాదారులు నగదు జమ, ఉపసంహరణకు శుక్రవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని ఎస్‌బిఐ బ్రాంచిలో స్థానికులతోపాటు శేరేపాలెం, కొత్తపాలెం, రామన్నపాలెం తదితర గ్రామాల నుండి ఖాతాదారులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. శుక్రవారం సిబ్బంది కొరతతో నగదు జమ, ఉపసంహరణకు ఒకే కౌంటర్ ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. దీనికితోడు బ్యాంక్‌లో ఎసి కూడా పని చేయకపోవడంతో ఉక్కబోతతో ఖాతాదారులు ఉక్కిరిబిక్కిరయ్యారు.

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న దినేష్‌శంకర్‌రెడ్డి

ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి సూచించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దినేష్‌శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో సైతం ఇక్కడకొచ్చి త్రీడీ ప్రింటింగ్ నేర్చుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతోపాటు నిత్యం ఏదొక కొత్త విషయాన్ని నేర్చుకోవటం బాల్యం నుంచే అలవాటు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు వేసే ప్రతి అడుగు విజయానికి మెట్టుగా, భవిష్యత్తుకు బాటగా నిలిచినప్పుడే కలలను సాకారం చేసుకోగలమని వివరించారు. శిక్షణ పొందిన 44 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయశర్మ, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

జనసేన నేత బొమ్మిడి సునీల్

ప్రజాశక్తి - నరసాపురం



సునీల్ చేతల మీదుగా సాయం పంపిణీ

సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జనసేన నేత బొమ్మిడి సునీల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని చేపల మసీదు వద్ద జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో అత్యధిక మెజార్టీతో గెలవడంపై జనసేన అభిమాని, మెకానికర్ కరీం వృద్ధులకు పంచులు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ తమ్ముడు సునీల్ విచ్చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కరీం జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. పవన్ కళ్యాణ్‌ను, నాయకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం హర్షణీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



నిమ్మలకు నేతల అభినందనలు

ఎంఎల్ఎ నిమ్మలకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కార్యాలయం వద్ద టిడిపి నేతలతో పాటు వివిధ పార్టీల, సంస్థల నేతలు, అధికారులు శుక్రవారం క్యూ కట్టారు. దీంతో కార్యాలయం పరిసరాలు కోలాహలంగా మారాయి. తొలుత క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం ఇఒ యాళ్ల సూర్యనారాయణ, చైర్మన్ కోరాడ శ్రీనివాస్ సారధ్యంలో పురోహితులు నిమ్మలకు ఆశీర్వచనాలు అందించారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో పట్టణ సిఐ మంగాదేవి, ఎస్ఐ బాదం శ్రీనివాస్, ఎఎస్ఐ మద్దాల శివాజీ, శీలబోయిన ఏసురాజు, మార్లింగంతోపాటు తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. రామానాయుడును పాలకొల్లు ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు. నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌వి.సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు ఉన్నారు.

పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు

విద్యాకానుక కిట్లను పరిశీలించిన డివైఇఒ శ్రీరామ్

ప్రజాశక్తి - నరసాపురం



పాఠ్యపుస్తకాలను పరిశీలించిన డివైఇఒ శ్రీరామ్

పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు అందించాలని డివైఇఒ డి.శ్రీరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మిషన్ హైస్కూల్‌లో విద్యాశాఖ గొడౌన్‌ను ఆయన పరిశీలించారు. స్థానిక ఎంఇఒ పి.పుష్పరాజ్యంతో కలిసి విద్యా కానుక కిట్లలోని షూ, బెల్టు, పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - పెంటపాడు

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు కండెల్లి సోమరాజు, చిర్ల పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలం వల్లూరుపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరు వారాలు పనిచేసినా మొదటి వారం డబ్బులు మాత్రమే వేశారని, తర్వాత డబ్బులు పడలేదని నేతల వద్ద కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ఉందని వేతనాలు ఆపడం సరికాదని, వెంటనే ఉపాధి బకాయిలు విడుదల చేసి కూలీలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునే బాధ్యత కూలీ చేతుల్లోనే ఉందని, పోరాటాల ద్వారానే ఈ చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకు కూలీలంతా ఐక్యంగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పల్లేటి గంగ, సిరిశెట్టి రాముడు, రాపాక సూర్యవతి, దెయ్యం సత్యనారాయణ, కుంచె శ్రీను, గుండు మొగులచిన్న, కంకిపాటి శాంతకుమారి, యడ్లపల్లి వెంకటరమణ విజయలక్ష్మి, ఆబోతు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేతలు

ప్రతి విద్యార్థీ మొక్కలు పెంచాలి

కమిషనర్ శ్యామల

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతి విద్యార్థీ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీల విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థీ విధిగా మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ గ్రేడ్-1 గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (అప్ కాస్ట్) జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విజేతలకు మొక్కలు, సైన్స్ పుస్తకాలు, ప్రశంసా పత్రాలు బహుకరించారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కలు నాటడంతోపాటు విద్యార్థులతో పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా పర్యావరణ కమిటీ కన్వీనర్ కె.మాధవిలత, ఉపాధ్యాయులు షేక్ బాబాజీ సాహెబ్, వి.సత్తిబాబు, అంకిత, కె.పద్మావతి, ఎంవి.సుభాషిణి, కలిగొట్ల గోపాల్‌శర్మ, గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ రానీయొద్దు

మున్సిపల్ అధికారులతో ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపాల్టీ పరిధిలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందొచ్చినా సహించేది లేదని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ పరిశీలనకు వెళ్లిన ఆయనకు శుక్రవారం మున్సిపల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం తదితర అంశాల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి పాలనలో జరిగిన అవకతవకలన్నీ బయటకు తీస్తానని, తమ పరిపాలనలో అవినీతి చేయాలనుకున్న అధికారులు ఎవరైనా బదిలీపై వెళ్లిపోవచ్చన్నారు. ఈ సందర్భంగా శాఖలవారీగా అధికారుల పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇనఛార్జి కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కలెక్టర్ కృషి అభినందనీయం

జనసేన జిల్లా అధ్యక్షులు గోవిందరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ సుమిత్‌కుమార్ కృషి అభినందనీయమని జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను శుక్రవారం కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా ఎన్నికలు నిర్వహించిన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు.

టిడ్కో ఇళ్లు త్వరితగతిన అప్పగించాలి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు పరాకాష్టగా నిలిచిన టిడ్కో ఇళ్లను అర్హులకు త్వరితగతిన పూర్తి చేసి అప్పగించాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తన నివాసంలో టిడ్కో ఇళ్ల అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల పరిస్థితి, మౌలిక సదుపాయాల కల్పన, పూర్తికాని ఇళ్ల పనులపై ఆయన ఆరా తీశారు. అర్హులందరికీ పూర్తయిన ఇళ్లను త్వరితగతిన ఇవ్వాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎర్ర కాలువ కింద ఉన్న నందమూరి అక్విడెక్టు వద్ద పేరుకుపోయిన ఇసుక మేటలను వెంటనే తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నిధుల విషయంపై తాను కలెక్టర్‌తో మాట్లాడానని తెలిపారు. రైతులకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

125 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మూడు రోజులుగా 125 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ చేశామని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ స్థానిక, రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు విరివిగా కొనుగోలు చేశారని అన్నారు. ఇంకా పరిశోధనా స్థానంలో ఎంటియు 1318, సత్యప్రమాణం రకం విత్తనాలు 500 క్వింటాళ్లు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 10 సోమవారం నుంచి వాటిని రైతులకు విక్రయిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

విజయ డయోగ్నస్టిక్స్‌తో ఎఎస్ఎన్ఎం ఒప్పందం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లులోని విజయ డయాగ్నస్టిక్స్ సెంటర్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా శుక్రవారం కళాశాలలో ఇంటెన్షిప్ మూల్యాంకనం పూర్తిచేసి విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేశారు. కళాశాలలోని విద్యార్థులకు ఉపాధి, ఉత్పాదకతలో ప్రావీణ్యం సంపాదించడానికి తగిన నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పించడానికి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి, ప్లేస్మెంట్ ట్రెయినింగ్ కోసం ఈ అవగాహన ఒప్పందం ఉపయోగపడుతుందని కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, విజయ డయాగ్నస్టిక్స్ సెంటర్ అధినేత కొమ్ముల మురళి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు హౌసింగ్ బోర్డుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీపాద సీతారామశర్మ (91) గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన కొవ్వూరు, లంకలకోడేరు, జిన్నూరు, పలు పాఠశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒక కుమారుడు విదేశాల్లో ఉన్నందున అంత్యక్రియలు శనివారం ఉదయం నిర్వహిస్తామని ఆయన సన్నిహితులు తెలిపారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయులు, హౌసింగ్ బోర్డు పెన్షనర్ల అసోసియేషన్ సంతాపం ప్రకటించింది.

అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా

కాలువ పూడిక పనులను పరిశీలించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలో జరిగే ప్రతి మంచి పనిలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం రాయలం తాగునీటి చెరువులోకి వెళ్లే పంట కాలువలో మాజీ సర్పంచి కోళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో పూడిక తీయించారు. ఆయా పనులను ఎంఎల్ఎ అంజిబాబు పరిశీలించి వారితో మాట్లాడారు. భీమవరాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసుకుందామని, ప్రతిఒక్కరి సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి అధికారీ చిత్తశుద్ధితో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కోళ్ల సీతారాం, కోళ్ల నాగబాబు, మాజీ ఎంపిటిసి వినాయక, సోమరాజు, పత్తి హరి, గ్యాస్ శీను, యర్రంశెట్టి శివకృష్ణ, నడింపల్లి శ్రీనివాసరాజు, డాక్టర్ బాబు, వీర మహిళలు పాల్గొన్నారు.

పితాని గెలుపుపై హర్షం

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గంలో టిడిపి కూటమి అభ్యర్థి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ 26,554 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల వల్లూరు, కొడమంచిలి గ్రామాల్లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. వల్లూరు, కొడమంచిలి గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, సర్పంచులు నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, అల్లం పద్మావతి సూర్యప్రకాష్, తాళం శ్రీను, సుబ్బారావు, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోడూరు: ఆచంట ఎంఎల్ఎగా గెలుపొందిన మాజీ మంత్రి పితాని సత్యనారాయణను పోడూరు గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ పితాని గెలుపొందడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి 164 సీట్లు గెలుపొందడం శుభ పరిణామమని హర్షం వ్యక్తం చేశారు. పితానికి మంత్రి పదవి వస్తుందని, ఆచంట నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని టిడిపి నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు రమేష్ రాజు, రుద్రరాజు వరహాలరాజు, రుద్రరాజు రవిరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర: నెగ్గిపూడి గ్రామపంచాయతీ ఆవరణలో వార్డు సభ్యురాలు కొవ్వూరు సీతా వెంకట నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ విజయోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పితానికి శుభాకాంక్షలు తెలుపుతూ పాలకవర్గ సభ్యులందరూ కేక్‌కట్ చేశారు. అనంతరం సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి, వార్డు సభ్యులు నూతన గ్రామ సచివాలయ బోర్డును ఆవిష్కరించారు.

వేసవి శిబిరాలు ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక గ్రంథాలయాల్లో ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని స్థానికులు కామరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గణపవరం గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొని వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల వారి మేధాశక్తి పెంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. శిబిరాలు ఏర్పాటు చేయడంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్.సుభాషిని, గుమ్మడి సుబ్బారావు, చదువుల సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పిప్పర గ్రంథాలయంలో ముగిసిన శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న ప్రముఖ లాయర్ గుడ్ల వెంకట కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాల వల్ల మేధాశక్తిని పెంచుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు పి.రంగారావు, బత్తుల రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

వాండ్రం రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - ఉండి

ఉండి నుంచి వాండ్రం రహదారిలోని రైల్వే గేటును నేటి నుంచి ఐదు రోజులపాటు రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. జూన్ 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 12వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకూ రైల్వే గేటు మూసి వేత కారణంగా కలిగే అసౌకర్యానికి ప్రయాణికులు, వాహనచోదకులు రైల్వే అధికారులకు సహకరించాలని ప్రకటనలో కోరారు.

సేవ చేయడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి - కాళ్ల

సంపాదనలో కొంతమేరకు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతృప్తినిస్తుందని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకట రామరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళ్లకూరులో వేసవికాలంలో ప్రజలకు 65 రోజుల పాటు ఉచితంగా మజ్జిగ, మినరల్ వాటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించామన్నారు. ఏప్రిల్, మే తోపాటు జూన్ 5వ తేదీ వరకూ మజ్జిగ చలివేంద్రం నిర్వహించామన్నారు. పార్థనా మందిరం నిర్మాణానికి 2,000 రూపాయలు ఆర్థిక సాయం అందించామన్నారు. ఇప్పటి వరకు రూ.82 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు, వివిధ పండుగలకు అన్నదానం చేయడం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, కంటి వైద్యం కోసం ఆర్థిక సాయం చేశామన్నారు.

ఎంఎల్ఎ పితానికి అధికారుల అభినందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆచంట ఎంఎల్ఎగా ఎన్నికైన పితాని సత్యనారాయణను నియోజకవర్గంలోని ప్రభుత్వాధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పితానిని కలిసిన వారిలో ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎంపిడిఒలతోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లులో అన్న సమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఐదు వేల మందికిపైగా యాత్రికులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకొల్లు - భీమవరం రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు. పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్ సారథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అమ్మవారిని దర్శించుకుని కొద్దిసేపు యాత్రికులకు అన్నదానం చేశారు. జనసేన పట్టణాధ్యక్షులు శిడగం సురేంద్ర అన్నసమారాధన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెట్టింగ్ సొమ్ము రూ.40 కోట్లతో వ్యక్తి పరారీ..?

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం జిల్లా కేంద్రంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి భీమవరంలో వందల కోట్ల రూపాయలు పందేలు జరిగాయని తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని కొందరు, లేదు అధికార పార్టీదే మళ్లీ అధికారం అంటూ మరికొందరు పెద్ద ఎత్తున పందేలు కాశారు. భీమవరం సీటు జనసేనకు మెజార్టీ 30,000 దాటుతుందని దానికి ఒకటికి రెండున్నర రెట్లు కొందరు కాస్తే మరికొందరు వైసిపినే గెలుస్తుందని ఇలా ప్రతి నియోజకవర్గంపైనా పందెం రాయుళ్లు పందేలు కాశారు. భీమవరం మండలంలోని ఒక గ్రామంలో అపార్ట్‌మెంట్‌లో హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఒక వ్యక్తి అద్దెకు ఉన్నట్లు సమాచారం. అతను దస్తావేజు లేఖరుగా తెలుస్తోంది. తనకున్న పలుకుబడితో ఎన్నికల్లో పెద్ద ఎత్తున బడా నేతలతో పందేలు కాసి దీనికి మధ్యవర్తిగా డబ్బు తన వద్ద ఉంచుకున్నాడని, కౌంటింగ్ రోజున రాత్రికి రాత్రి పందెం డబ్బులతో ఊరు వదిలి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ పనిలో అతని కోసం పెద్ద ఎత్తున గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేదని ఆయనపై కేసు పెట్టే సాహసం కూడా చేయడం లేదు. ఈ విషయం తెలిసిన ప్రజలు పందెం రాయుళ్లకు తగిన శాస్తి జరిగిందని జనాలు నవ్వుకుంటున్నారు.

9న విఆర్ఎ సంఘం రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం

పెనుమంట్ర: ఈ నెల 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్ వద్ద సంఘం రాష్ట్ర అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పల నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

కార్పొరేట్ స్థాయి విద్య సంఘమిత్ర లక్ష్యం

స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ కట్టా కాత్యాయిని, ఎమ్‌డి కట్టా సతీష్ వర్మ

ప్రజాశక్తి - పెనుమంట్ర


కాత్యాయిని, సతీష్ వర్మ దంపతులు



శ్రీ సంఘమిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్


ప్రిన్సిపల్ తంగిరాల హనుమ సుందరాచార్యులు

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే తమ విద్యా సంస్థ లక్ష్యమని శ్రీ సంఘమిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ కట్టా కాత్యాయిని, మేనేజింగ్ డైరెక్టర్ కట్టా సతీష్ వర్మ దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో అక్కడ విద్యార్థులకు అందే విద్య, ఇక్కడ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే సంకల్పంతో వెలగలేరు (మార్టేరు)లో సంఘమిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలోని భట్లమగుటూరు గ్రామం నుంచి వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడినా, గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందించాలని 2019లో ఎల్‌కెజి నుంచి 7వ తరగతి వరకూ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. 2022 నుంచి 8 నుంచి 10 వరకూ తరగతులు నడుస్తుండగా, 2022 - 23లో పదిలో మొదటి బ్యాచ్ విద్యార్థులు 89 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. సిహెచ్.లతశ్రీ 547 మార్కులు సాధించిందని తెలిపారు. 2023-24లో నూరుశాతం ఫలితాలు రాగా 574 మార్కులతో కోనాల చంద్రమౌనికారెడ్డి స్కూల్ స్థాయిలో ప్రథమంగా నిలిచిందన్నారు. తక్కువ ఫీజు, బస్సు సౌకర్యంతో గ్రామీణ ప్రాంత కార్పొరేట్ స్థాయి స్కూల్‌గా పేరు రావడం వెనుక ప్రిన్సిపల్ తంగిరాల హనుమ సుందరాచార్యులు, వైస్ ప్రిన్సిపల్ కోనాల రోజామణి, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ ఉందని వారు పేర్కొన్నారు. తమ విద్యార్థులు పదిలో ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ఎపిఆర్‌జెసి, పాలిసెట్‌లో ఎక్కువ సీట్లు సాధించడం కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తున్నామని తెలిపారు.

హెచ్ఎం ప్రభాకర్‌రావు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు


ప్రభాకర్‌రావు (ఫైల్‌ఫొటో)


మండలంలోని అజ్జమూరు గ్రామానికి చెందిన ప్రముఖులు కోళ్లపరువు యుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందన ప్రభాకర్‌రావు (52) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ప్రభాకర్‌రావు గతంలో అనేకసార్లు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా కూడా ఆయన అవార్డు పొందారు. స్థానికంగా ఉన్న నిరక్షరాశ్యులను ఒక చోటకు చేర్చి అక్షరాస్యతను వృద్ధి చేయడం, వారిని ఉన్నత విద్యకు ప్రోత్సహించడం వంటి వాటితో ఆయన సమాజంలో మంచి పేరు పొందారు. తల సేమియా వ్యాధిగ్రస్తులు అనేక మందికి రక్తదానం చేయిస్తూ ఆయన ప్రాణదాతగా వారి మన్నన పొందారు. ఆయన మృతి పట్ల ఎంఇఒ రవీంద్ర, సీతారామయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తోట వెంకటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, రామశేషు, వెంకటస్వామి, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

వైఎన్‌లో స్కాలర్‌షిప్ దరఖాస్తుల పరిశీలన

నరసాపురం: వైఎన్ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరానికి గాను వైఎన్ డిగ్రీ, జివిఆర్‌బిఇడి కళాశాలలో విద్యార్థుల స్కాలర్ షిప్ దరఖాస్తులను పరిశీలించారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.శోభారాణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి జివిఆర్‌కెఎస్.గణపతిరావు, పట్టణ సహాయక సాంఘిక సంక్షేమ అధికారి కె.బాలు సాధన బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు. కళాశాల ఇచ్చిన సమాచారం దరఖాస్తుల్లో సమాచారానికి సరిపోయాయన్నారు. విద్యార్థుల ఖాతాలను పారదర్శకంగా ఉన్నాయని, ప్రతి కళాశాలా ఇలా సమాచారాన్ని పొందుపర్చి ఉంచితే అందరికీ మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జిఎస్‌విఎస్.సాయిబాబా, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకట రత్నం, బిఇడి కళాశాల ప్రిన్సిపల్ పి.శాంతి పాల్గొన్నారు.

'రఘురామకృష్ణంరాజు రాకతో సమస్యలు పరిష్కారం'

ప్రజాశక్తి - ఆకివీడు


ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రామవరప్రసాద్, నేతలు

ఉండి నియోజకవర్గానికి సరైన వ్యక్తి ఎంఎల్‌ఎగా వచ్చారని, ఆయన రాకతో మండలంలో సమస్యలన్నీ తీరిపోతాయని టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ అన్నారు. టిడిపి కూటమి గెలుపు సందర్భంగా శుక్రవారం ఆ పార్టీ మండల కార్యాలయంలో పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమం ప్రారంభంలో కార్యాలయంలోని ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ఈ విజయం పార్టీ కార్యకర్తలదే అన్నారు. ఐదు సంవత్సరాల నుంచి మండలంలో పార్టీకి చెందిన ఏ కార్యకర్తా పార్టీని వదిలిపెట్టకుండా అంకితభావంతో పనిచేశారన్నారు. వారిపై ఎన్ని రకాల ఒత్తిళ్లు వచ్చినా ఎన్ని సమస్యలు సృష్టించిన శాంతితో వారి పనులు వారు చేసుకుంటూ వెళ్లారే తప్ప పార్టీ ఏ ఒక్కరూ మారలేదన్నారు. తమ కార్యకర్తలపై ఒత్తిడి తేవడమే కాకుండా తమ ఎంఎల్ఎ మంతెన రామరాజు (రాంబాబు)ను కూడా అనేకసార్లు అవమానించారని, మండలంలో ఏ ఒకచోట కూడా కనీసం ప్రోటోకాల్ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు కనీసం తెలియజేయకుండానే నడిపే వారన్నారు. సమస్యలన్నీ పరిష్కరించగల సమర్థుడు ఎంఎల్‌ఎగా రఘురామకృష్ణంరాజు ఎన్నికయ్యారన్నారు. త్వరలో తమ ఎంఎల్‌ఎకు అతిపెద్ద స్థానం రాబోతోందన్నారు. ప్రస్తుతం కార్యకర్తలందరూ ఓర్పుతో సహనంతో ఉండాలన్నారు. అనేక మంది సంఘ వ్యతిరేక శక్తులు కార్యకర్తలను కవ్వించి రెచ్చగొడుతున్నారని, ఎవరూ వాటికి బదులివ్వొద్దని ప్రసాద్ వారికి సూచించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నౌకోట్ల రామారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లం వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు బిహెచ్.తిమ్మరాజు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంట్ల గణపతి, నగర పంచాయతీ పాలకవర్గ ప్రతిపక్ష నాయకురాలు బొల్లం వీరశ్వేత, మాజీ సర్పంచి బుర్ర సుజాత మాట్లాడారు. అంతకుముందు పార్టీలోని శ్రేణులు కార్యకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించారు.

మలేరియారహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - గణపవరం

మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా శుక్రవారం పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో కోమర్రులో మలేరియాపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు గ్రామాల్లో ఈ నెల 30వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వాసవిలో సిఎస్ఇ డేటా సైన్స్ కోర్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి నూతనంగా సిఎస్ఇ డేటా సైన్స్ కోర్సు ప్రారంభించడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నుంచి అనుమతి లభించినట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 సీట్లతో ప్రారంభించనున్న ఈ అధునాతన కోర్సు ప్రస్తుతం బహుళ ప్రాచుర్యంలో ఉందని తెలిపారు. దాంతోపాటు ప్రస్తుతం కళాశాలలో నడుపుతున్న కంప్యూటర్ సైన్స్‌లో ప్రస్తుతం ఉన్న 240కు అదనంగా 60 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో ప్రస్తుతం ఉన్న 180కు అదనంగా 60 సీట్లు, పాలిటెక్నిక్ విభాగంలోనూ కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో అదనంగా 60 సీట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు కోట్ల వెంకట రామకృష్ణారావు, కోశాధికారి పేరూరి బాల కాశయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, ప్రిన్సిపల్ రత్నాకరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించి బహుమతులు పొందండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సురక్షిత ప్రయాణం కోసం ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేసి విలువైన బహుమతులు పొందాలని గూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేను రోజులకు జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో ప్రయాణించేవారు తమ టిక్కెట్ వెనుక పేరు, మొబైల్ నంబర్ రాసి బస్సులో ఉన్న గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. మే 16వ నుంచి జూన్ 7వ తేదీ వరకూ ప్రయాణం చేసిన వారి టికెట్లు శుక్రవారం ఉదయం 11:00 గంటలకు తాడేపల్లిగూడెం బస్ స్టేషన్‌లో ప్రయాణీకుల సమక్షంలో లక్కీ డీప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, యూనియన్ నాయకులు, ఆర్‌టిసి పిఆర్‌ఒ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

పెనుమంట్ర: పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలు వదిలి గ్రంథాలయాలను వినియోగించుకోవడం ద్వారా జ్ఞానాన్ని పొందాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, వివేకానంద ఇంగ్లీష్ స్కూల్ కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి కోరారు. శుక్రవారం మార్టేరు శాఖా గ్రంథాలయం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్యఅతిథులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, విశ్రాంత తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయిని పి.సువర్ణ గౌరి, పడాల జగన్నాథరెడ్డి, చిర్ల నరసింహరెడ్డి,పవన్ కుమార్, గ్రంథాలయ అధికారి పి.టీ. శివకుమార్తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.

ఉండి : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానాన్ని సాధించగలరని యండగండి కో-ఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్ అన్నారు. యండగండి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా చెరుకువాడ రవికుమార్ మాట్లాడారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు, పాల్గొన్న సుమారు 50 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేగేశ్న సత్యరాజ్, యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం వద్ద మే 15వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకూ వేసవి శిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముగింపు సభ అల్లూరి సాంస్కృతి కేంద్రం వద్ద నిర్వహించారు. ఈ ముగింపు సభకు శాస్త్రవేత్త రంగనీడి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రథమ శ్రేణి గ్రంథాలయం పిల్లలకు పెద్దలకు విజ్ఞానాన్ని పెంచే విజ్ఞాన భాండాగారం, వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి నవ్యశ్రీ, డ్రాయింగ్ ఫస్ట్ సాయి సూర్య, స్లిప్ టెస్ట్ లాస్యగౌరి, క్రాఫ్ట్ నవ్యశ్రీ, యశ్విత, హెప్సిబా, హర్ష, కార్తీక్ వివేకానంద, సన, రూప తదితర విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సాంస్కృతిక కేంద్రం అధినేత బాబుశ్రీ, పండ్రి నాథ్, రెడ్డప్ప ధవేజీ పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం బోను పవిడయ్య, వీరమ్మ శాఖ గ్రంథాలయం వద్ద మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. మే 15 నుంచి నిర్వహించిన శిబిరంలో పలువురు విద్యార్థులు పాల్గొని వేసవి సెలవుల్లో తమ విజ్ఞానాన్ని పెంచుకున్నారని గ్రంథపాలకుడు బత్తుల హనుమంతరావు తెలిపారు. అనంతరం విజ్ఞాన పోటీల్లో గెలిచన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంపన సాయిబాబా, డి.శ్రీనివాస్, జి.స్వరూప్‌దత్త, టి.రంగనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : విద్యార్థులు శాస్త్రీయ విధానాన్ని అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. గత 40 రోజులుగా స్థానిక మాదివాడ జిల్లా శాఖ గ్రంథాలయలో రీడర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది. ఈ శిబిరం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలతో కార్యక్రమాన్ని అలరించారు. నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ పుప్పాల పండు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P. No. 11/2023

Between:
సింహాద్రి సత్య భామామణి -పిటీషనర్
మరియు
సలాది వెంకటరత్నం, వగైరా -రెస్పాండెంట్లు

R-2: కంకిపాటి బాలాజీ, S/o. లక్ష్మినారాయణ, డో.నెం. 6-66, లయన్స్ నగర్, పాలకొల్లు.

పై నెంబర్ పిటీషన్‌లో ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు మీకు నోటీసులు పంపించినప్పటికి మీరు ఉద్దేశపూర్వకముగా నోటీసులు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. దావా ది. **02-07-2024వ తేదీనకు వాయిదా అయివున్నది.** కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడర్ గారి ద్వారా కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు వాయిదాకు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున దావా గ్రంథము జరుపబడునని తెలియచేయడమైనది.

(By Order)
తేది: 06-06-2024
పి.డి.యస్.వి.బాలాజీ, న్యాయవాది
పాలకొల్లు, సెల్: 94904 33732

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 3/2023

Between:
యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నర్సాపూర్ బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్ -వాది
మరియు
M/s. అన్నపూర్ణ SHG, రిప్రజెంటెడ్ బై ఇట్స్ లాదర్ శ్రీమతి పులపర్తి శిరోమణి, వగైరా -ప్రతివాదులు

D-4: లక్కవరపు రంగమని, W/o. శామ్యూలు, డో.నెం. 1-113, అరుంధతిపేట, లిఖితపూడి, సరిపల్లి పోస్ట్, నర్సాపురం మండలం.

D-5: నామవరపు మణి, W/o. రమేష్‌బాబు, డో.నెం. 2-30, అరుంధతిపేట, లిఖితపూడి, సరిపల్లి పోస్ట్, నర్సాపురం మండలం.

D-6: అన్నంపల్లి రత్నకుమారి, W/o. స్వామి, డో.నెం. 2-28, అరుంధతిపేట, లిఖితపూడి, సరిపల్లి పోస్ట్, నర్సాపురం మండలం.

D-7: లక్కవరపు జాన్సిరాణి, W/o. జయరాజు, డో.నెం. 2-45, అరుంధతిపేట, లిఖితపూడి, సరిపల్లి పోస్ట్, నర్సాపురం మండలం.

పై నెంబర్ దావాలో ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు మీకు సమన్లు పంపించినప్పటికి మీరు ఉద్దేశపూర్వకముగా సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. దావా ది. **04-07-2024వ తేదీనకు వాయిదా అయివున్నది.** కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడర్ గారి ద్వారా కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు వాయిదాకు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున దావా గ్రంథము జరుపబడునని తెలియచేయడమైనది.

(By Order)
తేది: 06-06-2024
పి.డి.యస్.వి.బాలాజీ, న్యాయవాది
పాలకొల్లు, సెల్: 94904 33732

పురపాలక సంఘ కార్యాలయం, నరసాపురం

ఆర్.ఓ.సి. నెం. 83/2007/ఎ1 తేది. 07-06-2024

బహిరంగ వేలం నోటీసు

నరసాపురం పురపాలక సంఘమునకు సంబంధించి ఈ దిగువ తెలిపిన వివిధ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సుల యందు గల ఖాళీగా ఉన్న షాపు రూములను మూడు సంవత్సరముల కాలపరిమితికి లీజుకిచ్చుటకు గాను ది. 22-06-2024వ తేదీ శనివారం ఉదయం 11.00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీ కమిషనర్ వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. కావున సదరు వేలమును ఆమోదించుటకు గాని లేక ఎట్టి కారణములు చూపకయే నిరాకరించుటకు గాను గౌరవ కౌన్సిల్ వారికి అధికారము కలదు.

క్రమ సంఖ్య	షాపింగ్ కాంప్లెక్స్ వివరములు	షాపు రూము నెం.	సాల్వెన్సీ రూ.	ధరావత్తు రూ.
1.	శిధిలావస్థకు చేరి తొలగింపబడిన విలేజి చావడి మరియు యర్రమిల్లి నారాయణమూర్తి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ స్థానంలో నూతనముగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్	గ్రౌండ్ ఫ్లోర్ నందలి షాపు: జనరల్ :- 11 నెంబర్ గల షాపు	రూ.1,00,000/-	రూ.75,000/-
		ఫస్ట్ ఫ్లోర్ నందలి షాపు: జనరల్ :- 13 మరియు 16 నెంబర్ గల షాపులు	రూ.1,00,000/-	రూ.50,000/-
2.	డా॥ కొప్పర్తి వేణుగోపాలరావు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	గ్రౌండ్ ఫ్లోర్ నందలి షాపులు: జనరల్ :- 4, 9, 12 మరియు 24 నెంబర్లు గల షాపులు	రూ.75,000/-	రూ.50,000/-
		ఫస్ట్ ఫ్లోర్ నందలి షాపులు: జనరల్ - 1,3,5,9,10,12, 14,15,17,19,20,21,23 మరియు 24 నెంబర్లు గల షాపులు	రూ.75,000/-	రూ.25,000/-
		ఫస్ట్ ఫ్లోర్ నందలి షాపులు: షెడ్యూలు కులము: 16 నెంబర్ గల షాపు ఫస్ట్ ఫ్లోర్ నందలి షాపు: షెడ్యూలు తెగలు :- 8 నెంబర్ గల షాపు	--	రూ.25,000/-
		ఫస్ట్ ఫ్లోర్ నందలి షాపు: వికలాంగులు: 6 నెంబర్ గల షాపు	రూ.75,000/-	రూ.25,000/-
3.	12వ వార్డులో పార్క్ రోడ్డులో గల మునిసిపల్ స్థలములో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ రేకుల షెడ్డు షాపు రూములు	జనరల్ షాపు :- 1 నెంబర్ గల షాపు	రూ.1,00,000/-	రూ.50,000/-
4.	శిధిలావస్థకు చేరి తొలగింపబడిన శ్రీ మండా సత్యనారాయణమూర్తి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మరియు ఫిష్ మార్కెట్ స్థానంలో నూతనముగా నిర్మించిన శ్రీ మండా సత్యనారాయణమూర్తి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మరియు ఫిష్ మార్కెట్	జనరల్ షాపులు :- 4,5,7,8,33,34,36,37,38 నెంబర్ గల షాపులు	రూ.1,00,000/-	రూ.1,00,000/-
		షెడ్యూలు తెగలు : 6 నెంబర్ గల షాపు	--	రూ.1,00,000/-
		నాయీ బ్రాహ్మణులు : 10, 31 నెంబర్ గల షాపులు	రూ.1,00,000/-	రూ.1,00,000/-
		వికలాంగులు : 32 నెంబర్ గల షాపు	రూ.1,00,000/-	రూ.1,00,000/-
5.	శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	జనరల్ షాపులు: 3,6 మరియు 7 నెంబర్ గల షాపులు	రూ.50,000/-	రూ.25,000/-
6.	శ్రీ అంబేద్కర్ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	జనరల్ షాపులు: 2 మరియు 3 నెంబర్ గల షాపులు	రూ.50,000/-	రూ.25,000/-

షరతులు: 1) గెజిట్ నోటిఫికేషన్ నెం. 72, తేది. 03-11-2021, గెజిట్ నోటిఫికేషన నెం. 110, తేది. 07-07-2009 మరియు గెజిట్ నోటిఫికేషన్ నెం. 28, తేది. 16-08-2019 మరియు గెజిట్ నోటిఫికేషన్ నెం. 13, తేది. 22-01-2024 గల షరతులకు లోబడి సదరు వేలం పాట యందు పాల్గొనవలెను. 2) పై తెలిపిన షాపు రూములలో రిజర్వుడు కేటగిరీకి చెందిన షాపు రూములకు గాను 6 నెలల లోపుగా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రములతో పాటుగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అర్హులు అగుదురు. 3) పై తెలిపిన షాపింగ్ కాంప్లెక్స్ నందలి 6 మరియు 32వ నెంబర్ షాపులు వికలాంగులకు చెందినవై యున్నందున సదరన్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకున్న వికలాంగ అభ్యర్థులు మాత్రమే అర్హులు అగుదురు. 4) పురపాలక సంఘమునకు బకాయిలు ఉన్న యెడల అట్టి వారు వేలము నందు పాల్గొనుటకు అనర్హులు. 5) బహిరంగ వేలంలో పాల్గొను షెడ్యూలు కులము మరియు షెడ్యూలు తెగలకు చెందిన అభ్యర్థులు సాల్వెన్సీ సర్టిఫికెట్ దాఖలుపరచవలసిన అవసరం లేదు.

అందుపై సదరు పాటలో పాల్గొనదలచిన వారు పై తెలిపిన విధముగా సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు ధరావత్తు సదరు వేలం పాటకు ముందుగా దాఖలుపరచి వేలం పాటలో పాల్గొనవచ్చును. యితర వివరములు కొరకు కార్యాలయపు పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ఇందుకు సంబంధించి పొందుపరచబడిన నిబంధనలు మరియు షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవలెను.

సం/- **డా॥ కె.వెంకటేశ్వరరావు**
కమిషనరు, నరసాపురం పురపాలక సంఘం